క్లుప్తంగా

ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

ఏఈఓ చెన్నయ్య



గుండాల గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తున్న ఏఈఓ చెన్నయ్య

దోమ: ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలని ఏఈఓ చెన్నయ్య తెలిపారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని గుండాల గ్రామంలో రైతుల వద్దకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ రైతు తనకున్న వ్యవసాయ భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, భూమి విస్తీర్ణం, రకం, పండిస్తున్న పంటలు, ఆధార్ నంబర్‌తో లింక్ ఉన్న మొబైల్ నంబర్ వంటి పూర్తి వివరాలు తమకు అందజేస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి ప్యాక్స్ డైరెక్టర్ పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి, దస్తయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.50వేల చెక్కును శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి అందజేశారు. మండల పరిధిలోని ఎన్కేపల్లికి చెందిన కుర్వ మల్లప్ప మనవరాలు అనారోగ్యానికి గురవ్వడంతో మెరుగైన వైద్యం కోసం ఆర్థికసాయంగా కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ కింద అందజేసే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు బోయిని బాల్‌రాజ్, ఉపాధ్యక్షుడు కుర్వ లక్ష్మప్ప పాల్గొన్నారు.

పేదలకు పంపిణీ చేసే భూమి పరిశీలన



ప్లాట్ల పంపిణీకి కేటాయించిన భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

యాలాల: మండల కేంద్రంలో గతంలో పేదలకు పంపిణీ చేసేందుకు మంజూరు చేసిన భూమిని తహసీల్దార్ వెంకటస్వామి శుక్రవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత పేరి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల భూమికి సంబంధించి ప్లాట్ల పంపిణీ చేపట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన తహసీల్దార్ సంబంధిత భూమిని సర్వే అధికారులతో కలిసి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో సర్వే నంబరు 289, 220కి సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఆయా భూమిలో సుమారు 130 మందికి 75 చొప్పున కేటాయించి పంపిణీ ప్రక్రియ మాత్రం చేపట్టలేదు. సంబంధిత భూమిని పూర్తిగా సర్వే చేయించిన అనంతరం పంపిణీ ప్రక్రియ నిర్వహించనున్నట్లు వారు గ్రామస్తులకు వివరించారు.

బిజ్వార్‌లో ఘనంగా బోనాలు



బోనాలతో మహిళలు

తాండూరు రూరల్: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామస్తులను ఆయురారోగ్యాలతో సల్లాగ చూడాలని అమ్మ వారిని వేడుకున్నారు. బిజ్వార్ గ్రామంలో శుక్రవారం బోనమ్మ, పోచమ్మ, రక్త మైసమ్మ అమ్మవార్లకు భక్తులు పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య మహిళలు బోనం ఎత్తుకుని ఆలయానికి తరలివెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు ఎమ్మెల్సీ కవిత రాక

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం విచ్చేయనున్నట్లు బీఆర్‌ఎస్ నాయకుడు సీమల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి నేటికి అమలు చేయడం లేదని విమర్శించారు.

పనుల్లో వేగం..

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. లబ్ధిదారుల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకున్న అధికారులు అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేశారు. అనంతరం ఇళ్ల ప్రొసీడింగ్ అందజేశారు. ఈ క్రమంలోనే నిర్మాణ పనులు చేపట్టడానికి ఉన్నతాధికారులు సిబ్బందితో కలిసి లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ముగ్గు పోయించారు. ప్రస్తుతం నిర్మాణ పనులను అధికారులు దగ్గరుండి చూసుకోవడంతో పనులు స్పీడ్‌గా కొనసాగుతున్నాయి.

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో లబ్ధిదారులు బిజీ
- జిల్లాలోనే తాండూరు మండలం మొదటిస్థానం
- అధికారులను అభినందించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు
- బిల్లులు త్వరగా మంజూరు చేస్తే పనులు పూర్తి చేస్తాం



చెన్‌గేస్‌పూర్‌లో నిర్మాణంలోని ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

తాండూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులు శరవేగంగా నిర్మాణ పనులను నిర్వహిస్తున్నారు. నిర్మాణ పనులు చేపట్టడంలో జిల్లాలోనే తాండూరు మండలం మొదటి స్థానంలో ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా మండల అధికారులను జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే అభినందిస్తున్నారు. ప్రభుత్వం లబ్ధిదారులను మరింతగా ప్రోత్సహిస్తే త్వరగా పూర్తయ్యే అవకాశం ఉందని వాపోతున్నారు. ఈ క్రమంలో ఇళ్ల బిల్లులను సకాలంలో మంజూరు చేస్తే నిర్మాణాల్లో వేగం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఇలా..

తాండూరు మండలంలో 33 గ్రామాలు ఉన్నాయి. మండలానికి 826 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. ప్రతీ ఊరికి 10 నుంచి 60 వరకు ఇచ్చారు. ఇందులో మేజర్ గ్రామ పంచాయతీ కరన్‌కోట్ గ్రామానికి 104, అంతారానికి-64, సంగెంకలానికి-59, మల్కాపూర్‌కు-46తో పాటు పలు గ్రామాలకు మొదటిదపాలో విడుదల చేశారు. నెల రోజుల క్రితం అన్నీ గ్రామాల్లోని లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల వరకు మంజూరు చేస్తోంది. బేస్‌మెంట్ బిల్లు రూ.లక్ష, గోడల నిర్మాణానికి మరో లక్ష, స్లాబ్ తర్వాత 2లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో రూ. లక్ష విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనుంది. ప్రస్తుతం తాండూరు మండలంలో 826 ఇళ్లకుగాను 230 ప్రొగ్రెస్‌లో ఉన్నాయి. 100 వరకు బేస్‌మెంట్ పూర్తయినట్లు అధికారుల లెక్కలు ద్వారా తెలుస్తుంది.

పెద్దేముల్ మండలంలో...

పెద్దేముల్ మండలంలో 37 గ్రామాల్లో 793 మంజూరు చేశారు. ఇందులో 302 ప్రొగ్రెస్‌లో ఉన్నాయని అధికారులు వివరించారు. కొన్నింటికి బేస్‌మెంట్ వరకు పూర్తయినట్లు సమాచారం.

అభినంధించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు

తాండూరు మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి జిల్లాలోనే ముందంజలో ఉంది. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తాండూరు ఎంపీడీఓ విశ్వప్రసాద్, హౌసింగ్ ఏఈ రహీంలను ప్రత్యేకంగా అభినందించారు. ఇలాగే ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సలహాలు, సూచనలు ఇచ్చారని తెలుస్తోంది. తాండూరు మండలాన్ని ఆదర్శంగా తీసుకొని మిగత మండలాల్లో కూడా ఇళ్ల నిర్మాణాలు కొనసాగించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

సహకరిస్తాం



మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ముందుకు రావాలి. ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వస్తే ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించి లబ్ధిదారులకు సహాయపడుతుంది. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రోత్సహిస్తున్నారు. తనతో పాటు సిబ్బంది కూడా లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు కావలసిన పూర్తి సహకారం అందిస్తున్నాం. హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో మరిన్ని ఇళ్లు పూర్తిచేస్తాం.

– విశ్వప్రసాద్, ఎంపీడీఓ, తాండూరు

రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలి

జీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఆర్ కృష్ణ



యాలాల: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న 42 శాతం బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం ఆర్డినెన్స్ తెస్తామని ప్రకటించింది. కానీ ఈ ఆర్డినెన్స్‌లు లేదా జీవోలు నిలువవని పేర్కొన్నారు. ఈ విషయంలో ఏ ఒక్కరైన ఉన్నత కోర్టుకు వెళితే అక్కడ పెండింగ్ పడే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఈ విషయం మళ్లీ మొదటికే వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా కాలం ఆలస్యం జరిగిందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి 21నుంచి నిర్వహించనున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టించేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగ భద్రత కల్పించిన రోజే రాజ్యాంగ హోదా దక్కుతుందని వివరించారు. లేనియెడల బీసీలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉండాలి

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బీసీలకు 42 శాతం రాజకీయ, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు కల్పించనున్నందుకు బీసీలందరూ కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటారని కాంగ్రెస్ యువ నాయకుడు శ్రీనివాస్ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నెరవేర్చుకున్నారని పేర్కొన్నారు. దీంతో వారు బీసీల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు.

బీసీ రిజర్వేషన్ల నిర్ణయం హర్షణీయం..

యాలాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోటా పెంపుపై మంత్రి వర్గం ఆర్డినెన్స్ ఇవ్వడం హర్షణీయమని మండల బీసీ సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగంకుర్దు మాజీ సర్పంచ్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు హన్మంతు మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీసీ రిజర్వేషన్ ఎంతో లాభిస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం సంతోషకరమన్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రత్యేక చొరవతో ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు మహిపాల్, మల్లప్ప, అంజిలయ్య, నాగయ్య, చందు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

కుల్కచర్ల: రైతు సంక్షేమానికి రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలని ఆర్బీఎల్ కంపెనీ సీఈఓ, తాండురు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సోదరుడు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామంలో గ్రామ శివారు నుంచి మొద్దుల కుంట వరకు రూ.4.50లక్షలతో మట్టిరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ పొలాలకు దారి ఉండాలని రైతులందరూ ముందుకు వచ్చి ఆర్థికంగా పరస్పరం సహకరించుకోవడం అభినందనీయమన్నారు. రైతుల సంక్షేమానికి తాము అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, రాంచంద్రయ్య, ఉమాశంకర్, శివయ్య, శంకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బోటు బోల్తాపడిన ప్రాంతాల పరిశీలన

అనంతగిరి: సర్పన్‌పల్లి ప్రాజెక్టులో బోటు బోల్తాపడి ఇద్దరు మహిళలు మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ ఘటనపై శుక్రవారం ఆయా శాఖల అధికారులు అక్కడికి వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించారు. రిసార్ట్ పరిసర ప్రాంతాలను తదితర వాటిని తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ 7 శాఖల జిల్లా స్థాయి అధికారులతో కమిటీ వేసి విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా ఇరిగేషన్, రెవెన్యూ, యూత్ ఆఫీసర్, సర్వే లాండ్, పశు సంవర్ధక శాఖ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అక్కడికి వెళ్లి ఘటనపై అన్ని కోణాల్లో ఆరా తీసినట్లు తెలిసింది. విచారణానంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందిచనున్నట్లు తెలిసింది.

ఉత్తమ సేవలకు ప్రశంసా పురస్కారం

కుల్కచర్ల: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ పనితీరు కనబర్చిన వైద్య సిబ్బందికి అవార్డులు అందజేశారు. శుక్రవారం జిల్లా అధికారులు నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాప్ నర్సులు ఫాతిమా, సాజన్‌లను ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి ప్రశంసా పురస్కారాలను అందజేసినట్లు మండల వైద్యాధికారి కిరణ్ పేర్కొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం వడ్డించాలి

తహసీల్దార్ గోవిందమ్మ, ఎంపీడీఓ గ్యామా



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గోవిందమ్మ, ఎంపీడీఓ గ్యామా, తదితరులు

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం వడ్డించాలని తహసీల్దార్ గోవిందమ్మ, ఎంపీడీఓ గ్యామా పేర్కొన్నారు. శుక్రవారం మోత్కూర్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ వెంకట్‌తో కలిసి మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందించడంతో పాటు మెరుగైన విద్య బోధనకు తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతీ విద్యార్థి పట్టుదలతో చదుకొని పేరు తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.పాండు, పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

పరిగిలో..

పరిగి: 33కేవి విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ హరిక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంతో పాటు, మండలంలోని పేదమాదారం, మధారం, రంగాపూర్, బసిరెడ్డిపల్లి, నజీరాబాద్, రంగంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని పేర్కొన్నారు. కావున ఈ విషయంలో వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బండిసంజయ్ జన్మదిన వేడుకలు

పరిగి: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండిసంజయ్ జన్మదిన వేడుకలను పట్టణ కేంద్రంలో శుక్రవారం బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, సిబ్బందికి అన్నదానం, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మారుతికిరణ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండిసంజయ్ ఎంతో సేవ గుణం కలిగిన వ్యక్తని కొనియాడారు.

మౌనేశ్వర ఆలయంలో భజన గీతాలు

దుద్యాల్: మండల కేంద్రానికి సమీపంలోని మౌనేశ్వర స్వామి ఆలయంలో భజన గీతం కార్యక్రమాన్ని భక్తులు జోరుగా నిర్వహించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు కొనసాగింది. దుద్యాల, లగచర్ల, హకీంపేట్ గ్రామాలకు చెందిన భక్తులు హాజరయ్యారు.

వేతనాలు విడుదల చేయాలి

అనంతగిరి: వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు డిసెంబర్ నుంచి వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 56మంది పనిచేస్తున్నారని వివరించారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు కల్పించుకుని వెంటనే వేతనాలు విడుదలయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిద్దాం

పూడూరు: ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించాలని మండల ఇన్‌చార్జి చిట్టిగిద్ద కిష్టయ్యమాదిగ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాకంచర్లలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ప్రతి గ్రామంలో జెండా ఎగురవేయాలని సూచించారు. మాదిగల అభివృద్ధే ధ్యేయంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యేసుమాదిగ, నర్సింహామాదిగ, మండల ఉపాధ్యక్షుడు శేఖర్‌మాదిగ, నాయకులు దిలీప్‌మాదిగ, సుధాకర్ మాదిగ, శ్రావణ్ మాదిగ, విజయ్‌మాదిగ, సంతోష్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

బెదిరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

కేవీపీఎస్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న నాయకులు

యాలాల: కులం పేరుతో దూషించి, చంపుతానని బెదిరించిన మాజీ ప్రజాప్రతినిధిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని జుంటుపల్లి గ్రామానికి చెందిన నెత్తి వెంటకప్ప అదే గ్రామానికి చెందిన శ్రావణ్‌రెడ్డి పొలంలో గురువారం ట్రాక్టర్ రోటివేటర్‌తో దున్నాడు. ఈ విషయంలో అదే రోజు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ వెంకటరాంరెడ్డి వెంకటప్పకు ఫోన్ చేసి కులం పేరుతో దూషించి కారుతో గుద్ది చంపుతానని బెదిరించాడని బాధితుడు తెలిపాడు. దళితుడిపై దౌర్జన్యం చేస్తున్న వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వ్యకాస జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి మహేందర్, మండల అధ్యక్షుడు సూర్యప్రకాశ్, క్రిష్ణ, ఆశప్ప, వెంకటప్ప, పకీరప్ప, నర్సింహులు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దుద్యాల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మలేరియా, ఫైలేరియా సబ్ యూనిట్ అధికారి పక్కిరప్ప పేర్కొన్నారు. శుక్రవారం దుద్యాల్ మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో ఎక్కడ కూడా చెత్తా, చెదారం ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. గ్రామంలోని మురుగు కాల్వల్లో మురుగు చేరకుండా పంచాయతీ కార్మికులు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు ఎక్కువైతే దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, చికన్ గున్యా, టైఫాయిడ్ వంటి వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. అనంతరం హస్నాబాద్ గ్రామంలో మురుగు కాల్వల్లో దోమల మందు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ఏఎస్‌ఎమ్ రాములమ్మ, ఆశ కార్యకర్తలు పద్మ, సరిత, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య



కుస్మసముద్రం గ్రామంలో నూతన కమిటీతో కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: పార్టీ కోసం పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం కుస్మసముద్రం, అనంతసాగర్ గ్రామాల్లో కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ పేదల అభ్యున్నతికి పనిచేస్తుందన్నారు. కుస్మసముద్రం గ్రామంలో పార్టీ అధ్యక్షుడిగా డ్యాగ కేశవులు, ప్రధాన కార్యదర్శిగా బాబు, యువజన విభాగ అధ్యక్షుడిగా రాఘవేందర్, అనంతసాగర్‌లో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చిల్ల రమేష్, యువజన విభాగం అధ్యక్షుడిగా కిట్టు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు మహేశ్, మండల మాజీ అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మార్కెట్ కమిటీ డైరక్టర్ భరత్‌కుమార్ రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య మిత్రుల 'బాధ్యత'

- విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ క్యాన్లు, దుప్పట్లు పంపిణీ
- 16 ఏళ్లుగా పేద విద్యార్థులకు చేయూత



ప్లేట్లు పంపిణీ కోసం వెళ్తున్న బాల్య మిత్రులు

కొడంగల్: పట్టణానికి చెందిన పలువురు బాల్య మిత్రులు మండల పరిధిలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పేట్లు, వాటర్ క్యాన్లు, దుప్పట్లను శుక్రవారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని సీపీఎస్ బాలుర, ఇంద్రనగర్, గుండ్లకుంట, హుస్సేన్‌పూర్, బీమ్లీతండా, బోయ తండా, బోనమ్మ తండా, నాగారం, బూల్కాపూర్, ప్యాలమద్ది, పాత కొడంగల్ తండా, ఎక్కచెరువు తండా విద్యార్థులకు సుమారు రూ.30వేల వస్తువులను అందజేశారు. స్నేహానికి ప్రతిరూపంగా నిలిచిన బాల్య మిత్రులను విద్యావంతులు అభినందిస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1990 బ్యాచ్ విద్యార్థులు బాధ్యత అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాము సంపాదించిన డబ్బులో కొంతమేర సమాజానికి ఉపయోగడాలనే సంకల్పంతో పనిచేస్తున్నారు. బాల్య మిత్రులు కటుకం వెంకటేశ్, మురహరి వశిష్ట, శివకుమార్ గుప్తా, లక్ష్మీనారాయణ జోషి, కిట్టుస్వామి, కృష్ణారావు, కొంతం సతీష్, నగేశ్, ఆనంద్‌కుమార్ లాహోటీ, కానుకుర్తి రమేష్, వేణు, బాలరంగాచారి తదితరులు కలిసికట్టుగా పేద విద్యార్థులకు సేవ చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

మెజార్టీ సీట్లు గెలుచుకోవాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి

మర్పల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలుచుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని సిరిపూరం గ్రామానికి ఎంపీ కోట కింద మంజూరైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి ఆయన పనులు ప్రారంభించారు. మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేద ప్రజల జీవన స్థితి గతులను మార్చుతున్నాయన్నారు. పీఎం మోదీ పాలనలో 11 సంవత్సరాలుగా భారతదేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు.

మూసని యాదవరెడ్డికే బాధ్యతలు..

స్థానిక సంస్థల్లో ఎంపీటీసీలు, జెడ్పీటీసీల, సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక బాధ్యతను దామస్తాపూర్ మాజీ సర్పంచ్ మూసని యాదవరెడ్డికే అప్పగిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కోఆర్డినేటర్ నందు, జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, మండల అధ్యక్షుడు బన్నే మల్లేశ్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీమంత్‌కుమార్, జిల్లా నాయకులు మహేశ్వరి, మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, జంగం జైపాల్, పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

దళిత ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

యాలాల: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం తహసీల్దార్ వెంకటస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అధికార పార్టీ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల కోసం నియమించిన కమిటీ అనర్హులకే మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కేవీపీఎస్, వ్యకాస నాయకులు మల్కయ్య, బుగ్గప్ప, ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి మహేందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సూర్యప్రకాష్, మెట్లి క్రిష్ణ, నర్సింహులు, ఆశప్ప, పకీరప్ప, శివకుమార్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని పీఏసీఎస్ చైర్మెన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నిజాంపేట్‌మేడిపల్లి, పోతిరెడ్డిపల్లి, పూడూరు, చీలాపూర్, ఎన్కేపల్లి తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ తీసుకున్న వారు వెంటనే పనులను ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంత్‌రెడ్డి, రవి, నారాయణ, రాములు, పాల్గొన్నారు.



యాలాల: తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు